# 13. 'మనోహర్' కహానీ

**సుమారు** పాతికేళ్ల కిందట నేను నూజివీడులో ఉద్యోగం చేస్తున్నప్పుడు మా డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌గారు మా ఆఫీసుకి ఇనస్పెక్షన్‌కొచ్చి " ఈ జూన్ 30వ తేదీకి ఈ ఆఫీస్ శాంక్షన్ చెల్లిపోతుంది. నువ్వు ట్రాన్స్‌ఫర్‌కి సిద్ధంగా ఉండు." అన్నారు. "ఎక్కడికి వేస్తారండి" అని అడిగేను చాపల్యం చావక. "హైదరాబాదు టవున్ సర్వే యూనిట్‌లో ఒక ఖాళీ ఉంది. అక్కడ వేసెయ్యనా?" అన్నారాయన చిరునవ్వుతో. నేనేమీ అనలేదు గాని, ఆయన ఆ కాంప్ నుంచి తిరిగి హైదరాబాదు చేరుకున్నాక వేసిన మొదటి పది ఆర్డర్లలో ఒకటై ఉండాలి, నా ట్రాన్స్‌ఫర్ ఆర్డరు. సరిగ్గా వారం తిరిగేలోగా వచ్చేసింది.

సరిగ్గా ఆ ఆర్డర్ నాకు అందిన సమయానికే హైదరాబాదు టవున్ సర్వే ఆఫీసర్ (మనోహర్) గారికి కూడా ఒక కాపీ అందింది కదా. ఆయన నా కేటగిరీలో తన హయాంలో ఉన్న ఎనిమిది పోస్టుల్లో అప్పటికి ఉన్న ఒక్క ఖాళీలోను, నాకింది కేటగిరిలో పనిచేస్తూ ఉండిన వెంకటాద్రి అనే ఒకాయన్ని తాత్కాలికంగా నియమించుకొని పనిచేయించు కుంటున్నాడు. కింది కేటగిరీ ఉద్యోగి పై కేటగిరీ డ్యూటీలు చేస్తే పై కేటగిరీ జీతం రాదు గాని ఎలవెన్సులు, అధికారం వస్తాయి. నేను జాయిన్ కాగానే వెంకటాద్రి ఆ ఎలవెన్సులూ అధికారం వదలుకుని కింది కేటగిరీకి చెందినవే స్వీకరించి పని చేయాలి. అందుకైతే వెంకటాద్రికీ ఇష్టంలేదు. ఆఫీసర్ గారికీ ఇష్టం లేదు- అని, నేను జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన గంటలో నాకు తెలిసిపోయింది. అందుకని శుక్రవారం డ్యూటీలో చేరినా; శనివారం, ఆదివారం సెలవులుకదా! సోమవారం ఉదయం చార్జి ఇస్తాడులే అనుకుని ఆ పూటంతా పరిచయాలతో, నమస్కారాలతో గడిపేశాను.

సోమవారం ఉదయం ఆఫీసుకి వచ్చేసరికి వెంకటాద్రి రెండు రోజులు శలవు పెట్టేడని తెలిసింది. ఏం చెయ్యమంటారు అని మనోహర్ గార్ని అడుగుదామని ప్రయత్నించేటప్పటికి ఆయన ఉదయం తొమ్మిది గంటలకి ఆఫీస్‌కొచ్చి, ఏదో అవసరమైన కాగితాలు చూసుకునీ తీసుకునీ డైరక్టర్ గారి ఆఫీసుకి వెళ్లేరని తెలిసింది. "అక్కణ్నించి అలా సెక్రటేరియట్‌కి వెళ్లి, మధ్యాహ్నం భోజనానికి ఇంటికెళ్లి, సాయంకాలం మూడున్నరకి ఆఫీస్‌కొస్తారని డఫేదారు చెప్పేడు. సరే కదా అని నేను కూడా టైం పాస్ చేసి సాయంకాలం నాలుగు గంటలకి ఆఫీస్‌కెళ్తే మేనేజరుగారు నా చేతిలో ఇంకో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ లాంటి కాగితం పెట్టేడు.

దాని సారాంశం ఏమిటంటే, నేను హైదరాబాదులోనే ఉండొచ్చు. కాని ఈ ఆఫీసులో పని చెయ్యక్కర్లేదు. ఐతే జీతం మాత్రం (శాంక్షన్ అయిన పోస్టు ఇక్కడే ఉందికనక) ఇక్కడే ఇస్తారు. పని బోర్డ్ ఆఫ్ రెవెన్యూ ఆఫీసులో ఒక అసిస్టెంటు సెక్రటరీ గారి దగ్గర చెయ్యాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో (అప్పటికి) ఉన్న ఇరవై జిల్లాల్లోని గ్రామ కరణాలకి సర్వే సామాన్లు పంపకం చేసే కార్యక్రమం సిద్ధంగా ఉంది. పొలాలు కొలిచే గొలుసు, క్రాస్టాఫ్, మేకులు, పది లింకుల కర్రలు ఒక్కొక్క సెట్టుగా ఇయ్యాలి. ప్రభుత్వం దానికయ్యే ఖర్చు శాంక్షన్ చేసింది. సామాన్లు సరఫరా చెయ్యడానికి టెండర్లు పొందిన కంట్రాక్టర్లు ఎవరివ్వవలసినవి వారు తెచ్చి బోర్డ్ ఆఫ్ రెవెన్యూ ఆఫీసులో ఈ అసిస్టెంటు సెక్రటరీగారికి వప్పగించడానికి మూడు రోజులనుంచీ ప్రయత్నిస్తున్నారు. ఆయనేమో "అవి నేనెలా పుచ్చుకుంటాను, వాటిని ఎవరో ఒకరు పరీక్ష చేసి పనికొస్తాయని ఆమోదముద్ర వేస్తే తప్పు?" అన్నాడట. అలా అలా ఆ సామాన్లు పరీక్ష చేసే పని హైద్రాబాదు టవున్ సర్వే ఆఫీసర్‌గారు తన సిబ్బంది చేత చేయించాలని ఆర్డర్స్ పడ్డాయి. "నా సిబ్బంది అసలే ప్రాజెక్టు వర్కుమీద

ఉన్నారు. వాళ్లకి పీకలమొయ్యా పనుంది కనక ఇది మా పనిగాదు." అని రాసిన ఆఫీసర్‌గారే, నేను జాయినవ్వడంవల్ల వెంకటాద్రికి కష్టమూ నష్టమూ కలగవచ్చునని తెలిసాక ఈ సామాన్ల పరీక్ష పని ఫలానా వ్యక్తిచేత చేయించేస్తానని మళ్ళా రాసి, డైరెక్టర్‌గారి ఆమోదం పొంది, ఆ ఆర్డర్ నాకు దయచేసేరు.

రోజూ ఉదయం పదిన్నరకి వచ్చి ఏదో ఒక లాటు దింపించి, చెకింగ్ చెయ్యాలి. మొత్తం నాలుగువేల సర్వే గొలుసులు, నాలుగువేల క్రాస్ స్టాఫులు, నాలుగువేల పది లింకుల గడలు, నలభైవేల మేకులు. గొలుసు అయితే అంతా నేలమీద పరిచి చూడాలి. 66 అడుగుల పొడవుందా లేదా? నూరు లింకులు రెండు ఇత్తడి కడియాలు ఉన్నాయి కదా. ప్రతి పది లింకుల దగ్గిర పది, ఇరవై, ముప్ఫయి, నలభై అని సూచించే ఇత్తడి బిళ్లలున్నాయా లేవా? ఇవి, ప్రశ్నలు. క్రాస్ స్టాఫ్ అయితే, ఇనుపచువ్వ ఐదడుగుల పొడుగుండాలి. మూడూ బై ఎనిమిది ఇంచీ మందం ఉండాలి. కిందిని మొన సూదిగా కమ్మరంలో అరగతీసి ఉండాలి. మీదిని అంగుళంన్నర చవుకంతో, నాలుగు రంధ్రాలతో, ఒక చేతఇనుం బిళ్ల ఉండాలి. దాని మీద టేకు కర్రతో చేసిన నాలుగు ఇంచీల చౌకం అంగుళంన్నర మందం గల దిమ్మ. దానికి 90 డిగ్రీల చొప్పున అరంగుళం లోతుకి, అంగుళంలో పదహారో వంతు వెడల్పుకి గాడీలు కోసి ఉండాలి. ఇంక పది లింకుల గడలయితే, అది సరిగ్గా పదిలింకుల పొడవుండాలి. రెండు చివర్ల దగ్గరా పొన్నులుండాలి. లింకూ లింకూ మార్కింగు చేసి నలుపూ తెలుపూ రంగులు వేసుండాలి. అన్నిటికన్నా ముఖ్యంగా పదిలింకుల కర్రా ఏకాండిగా (మధ్యలో అతుకులు లేకుండా) ఉండాలి.

నా చాదస్తానికి ఆ కంట్రాక్టర్లు తెచ్చిన సరుకు ఏదీ నిలబడలేదు. అసలు పనికిరానివి ఎక్కువ. కొంచెం రిపేరు చేయిస్తే పనికొచ్చేవి కొంచెం. నిరభ్యంతరంగా పనికొచ్చేవి అతి కొద్ది. పనికొచ్చే వాటిని లెక్క పెట్టి స్టోర్ రూమ్‌కి చేర్చి రసీదిచ్చి, అసలు పనికి రాని వాటిని అక్కడికక్కడే విరక్కొట్టించడంతో, కంట్రాక్టర్లు ముందుగా మా అసలు ఆఫీసర్‌గారికీ, ఆయన నాకేం తెలియదని తప్పుకోగానే అసిస్టెంట్ సెక్రటరీగారికీ మొరలు పెట్టుకున్నారు. ఆయన సరాసరి మైదానంలో కొచ్చేసి "నాలుగు వేల సెట్స్ సామాన్లు చెకింగు చెయ్యడానికి నిన్నిక్కడ పెడితే ఈ పదిరోజులకీ నువ్వు పాస్ చేసి స్టోర్స్‌లో పెట్టినవి యాభై సెట్లు కూడా లేవే. ఇలా అయితే ఈ నాలుగువేల సెట్సు చెక్ చెయ్యడానికి నీకు మూడేళ్లు పడ్తే పట్టింది గాక, అక్కడ గ్రామాల్లో కరణాలు గొలుసూ కర్రాలేక సర్వే పన్లు మానేసి ఎన్నాళ్లు కూర్చోవాలి?" అని నన్ను దబాయించాడు. "అయితే తప్పుడు సామాన్లు పాస్‌చేసి ఏ పాపం ఎరగని వాళ్లచేత తప్పులు చేయించాలంటారా?" అని నేను కూడా ఎదురు తిరిగేను. ఆయన ఆ వేళకి ఊరుకుని మర్నాడు ఉదయం మా ఆఫీసర్ మనోహర్‌గారిని తీసుకొచ్చేడు. ఆయన చాలా సౌమ్యంగా చెప్పేడు. "ఏదైనా వస్తువు నాణ్యత పరీక్షించేటప్పుడు మరీ అంత చాదస్తానికి పోకూడదు. కొంచెం చూసీచూడనట్టు పోవాలి. దేనికైనా పట్టూ విడుపూ ఉండాలి కదయ్యా. పనికిరావని నువ్వు కండెమ్ చేసిన సామాను ఆ కాంట్రాక్టర్లకి ఎందుకూ పనికిరావు కదా. వాళ్లు మట్టికొట్టుకు పోతారు, పాపం".

నేను లొంగలేదు. "ఈ తప్పుడు సామాన్లతో అసలే అంతంత మాత్రం సాంకేతిక పరిజ్ఞానం గల గ్రామ కరణాలు తప్పుడు సర్వేలు చేస్తే గ్రామాల్లో భూమి తగాదాలు ఇంకా ఎక్కువైపోయి కోర్టులన్నీ కేసుల్తో కిటకిటలాడిపోతాయి సార్" అని చెప్పేను.

అంతే. మర్నాడు డ్యూటీకెళ్లేసరికి నన్ను నాగార్జునసాగర్ కాల్వల భూసేకరణ ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ చేస్తూ డైరెక్టర్‌గారిచ్చిన ఆర్డర్ ముట్టింది. నా హైదరాబాదు ఉద్యోగ పర్వం పదమూడు రోజుల్లో ముగిసింది.

*

*("ఆంధ్రభూమి" డెయిలీ : 27-7-1988)*